

## ఆటోలో పసిగుడ్డు

దుండిగల్: సూరారం, విశ్వకర్మకాలనీలోని రోడ్డు పక్కన నిలిపిన ఓ ప్యాసింజర్ ఆటోలో ఓ వ్యక్తి ప్లాస్టిక్ బ్యాగును వదిలివెళ్లాడు. ఆటో యజమాని ప్లాస్టిక్ బ్యాగు ఉండటాన్ని గమనించి, అందులో ఏం ఉందో చూడకుండానే రోడ్డు పక్కన పడేశాడు. కాలనీవాసులు సదరు ప్లాస్టిక్ బ్యాగులో మగ శిశువు ఉన్నట్లు గుర్తించి, పోలీసులకు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులకు సమాచారం అందించారు. అదే సమయంలో స్థానికంగా పిల్లలు లేని ఓ కుటుంబం శిశువును పెంచుకునేందుకు ముందుకువచ్చింది. ఈ క్రమంలో వైద్యపరీక్షల కోసం శిశువును స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నెలలు నిండకపోవడంతోనే శిశువు మృతిచెందినట్లు చెప్పారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 18 నవంబర్ 2024 | HYDERABAD




జవహర్‌నగర్‌లో ఆదివారం తెలంగాణ స్టేట్ బీఎంఎస్, బీపీటీఎంఎం జేఏసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఆర్టీసీ బస్సులో భిక్షాటన చేసి... వినూత్నంగా నిరసన తెలిపారు. - జవహర్‌నగర్, నవంబర్ 17

# అక్రమ నిర్మాణానికి బిగ్ బ్రదర్ అండ..!

## నోటీసులతో సరి.. కూల్చివేతల జోలికి వెళ్లని జీహెచ్ఎంసీ

- చర్యల విషయంలో సామాన్యులపై ఒకలా- ఉన్నోళ్లకు మరోలా.. వ్యవహరిస్తున్న జోనల్ కమిషనర్లు
- ఎస్‌టీఎఫ్ వ్యవస్థను సమూల ప్రక్షాళన చేయాలంటున్న ప్రజలు

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ) :



### కావురి హిల్స్ ఫేజ్- 2లో..

మాదాపూర్ కావురి హిల్స్ ఫేజ్- 2 రోడ్డులోని దాదాపు 1000 గజాల స్థలంలో ఓ వ్యాపారస్తుడు సెకండ్ హ్యాండ్ కార్ సేల్స్ వ్యాపారానికిగాను షెడ్డు నిర్మాణం చేపడుతున్నాడు. ఈ వ్యాపారస్తుడి వద్దకు జేసీబీతో వచ్చి హల్‌చల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేసిన చైన్‌మెన్..చివరకు రూ.10 లక్షలకు భేరం కుదుర్చుకుని ఈ నిర్మాణ కూల్చివేత చేపట్ట లేదు..ఈ తతంతాన్ని 'నమస్తే' కథనాన్ని ప్రచురించడంతో విచారణ చేపట్టి సంబంధిత చైన్‌మెన్‌పై జోనల్ కమిషనర్ బదిలీ వేటు వేశారు. సంబంధిత నిర్మాణదారుడికి అప్పటికే మొదటి నోటీసు ఇచ్చిన అధికారులు ఇటీవల రెండో నోటీసు (స్పీకింగ్ ఆర్డర్) ఇచ్చారు. ఇక్కడ నోటీసులను లెక్క చేయకుండా సదరు వ్యక్తి నిర్మాణ పనులను తుది దశకు చేర్చాడు. రేపో, మాపో అధికారిక వ్యాపారానికి సిద్ధమవుతున్నాడు. నోటీసుల ఇచ్చారే తప్ప.. కూల్చివేత జోలికి వెళ్లకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ నిర్మాణదారుడి వెనుక సమీపంలోనే ఉన్న బిగ్ బ్రదర్ ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

### అనుమతులకు విరుద్ధంగా ..

ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని రాంనగర్ ఇండస్ట్రియల్ హౌసింగ్ కాలనీలో అక్రమ నిర్మాణంపై స్థానికుడు అనిల్‌కుమార్ ఆగస్టు 12న ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆ సర్కిల్ ప్లానింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించి ఆ నిర్మాణం అనుమతులకు విరుద్ధంగా నిర్మించినట్లు గుర్తించి యూసీ 8026గా నమోదు చేసి ఆగస్టు 28న సదరు నిర్మాణంపై డిప్యూటీ కమిషనర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం నిర్మాణదారుడు 27న వివరణ ఇచ్చాడు. ఆ వివరణ సంతృప్తికరంగా లేదని ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2న స్పీకింగ్ నోటీసు 19/టీపీఎస్/డీసీ/సీఐఆర్-15 కింద నోటీసు జారీ చేసి 15 రోజుల్లో కూల్చేసుకోవాలని లేదంటే తామే వచ్చి కూల్చేస్తాం అంటూ స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసి మౌనం వహిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు నెలలు గడిచినా.. అక్రమ నిర్మాణ జోలికి వెళ్లలేదు. పనులు మాత్రం సదరు నిర్మాణదారుడు జరుపుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులపై అవినీతి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

### ఇప్పటివరకు కూల్చలేదు..

అల్వాల్ సర్కిల్ వెంకటాపురం ఇందిరానగర్‌లో సిల్ట్+2 బిల్డింగ్‌కు అనుమతి తీసుకొని సిల్ట్+4 అంతస్తులు నిర్మిస్తున్నట్లు యూసీ -7319గా ప్లానింగ్ విభాగం అధికారులు గుర్తించారు. ఈ అక్రమ నిర్మాణానికి జూలై 12న షోకాజ్ నోటీసు (యూసీ 7319/19)గా జారీ చేశారు. జూలై 26న స్పీకింగ్ నోటీసు(లెటర్ నం 68) జారీ చేశారు. అదనంగా నిర్మిస్తున్న రెండు ఫ్లోర్‌లను కూల్చేయాలని కూకట్‌పల్లి జోన్ నోడల్ అధికారికి అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విన్నవించారు. కానీ..ఈ నిర్మాణం జోలికి వెళ్లకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం.

### అవినీతి మత్తులో ప్లానింగ్

అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం..ఇది జీహెచ్ఎంసీ అధికారులు చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు..ప్రమాదకరంగా నిర్మాణాలు జరుగుతున్నా..అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు..కానీ సదరు అనుమతి పొందిన నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా.. సదరు అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేసినా..అధికారులపై ఒత్తిడి తెచ్చినా కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. ఆపై చర్యలకు వెళ్లడం లేదు..ఇదే సమయంలో సదరు షోకాజ్ అందుకున్న నిర్మాణదారుడు డబ్బులిస్తే చాలు ..ఆ నిర్మాణ జోలికి వెళ్లడం లేదు..అదేమని అడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఒక నిర్మాణం రాత్రి రాత్రే జరగదు..రోజుల తరబడి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా..ముడుపుల మత్తులో పడి నిబంధనలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాతర వేస్తున్నారు.

### ఎస్‌టీఎఫ్ ఎక్కడ?

మున్సిపల్ చట్టం 2019లోని సెక్షన్ 178లో పొందుపరిచిన మార్గనిర్దేశక సూత్రాలను జోనల్ కమిషనర్లు బేఖాతరు చేస్తున్నారని, టీఎస్ బీపాస్ చట్టంలోని 3(2)లోని నియమావళి ప్రకారంగా జోనల్ పరిధిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలకు జోనల్ కమిషనర్ నేతృత్వం వహించడం, జోనల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన బాధ్యత తీసుకోవాల్సి ఉంది. గత కమిషనర్ లోకేశ్‌కుమార్ టీఎస్ బీపాస్ చట్టం-2020లోని సెక్షన్ 28(1) ద్వారా సంక్రమించిన అధికారాలు, నియమాలు జీవో నం. 200లోని సూత్రాలను అనుసరిస్తూ జోన్లకు 6 మంది నోడల్ అధికారులు 24 మందితో 12 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను, సర్కిళ్లలోని వార్డుల ప్రకారంగా 84 మంది న్యాక్ ఇంజినీర్లతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీంలు అక్రమ కట్టడాల కూల్చివేత, జరిమానాలు, సీజ్ చేయడం, పంచనామా వంటివి నిర్వర్తించాలని ఆ ఉత్తర్వులో స్పష్టం చేసింది. కానీ ఎస్‌టీఎఫ్‌ల లక్ష్యాలు పక్కదారి పట్టాయి. అవినీతి అలవాటుగా పడిన కొందరు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో కమిషనర్ ఇలంబర్తి దృష్టి సారించి ఎస్‌టీఎఫ్‌ను సమూల ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

# మెట్రో కోసం.. ఆగని పోరాటం

## మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలు



సిటీబ్యూరో: మెరుగైన రవాణా సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. నిత్యం లక్షన్నర మంది నార్త్ సిటీ నుంచి కోర్ సిటీకి రాకపోకలు సాగిస్తున్నా... ఆధునిక రవాణా సౌకర్యాలను కల్పించడంలో విఫలమవుతున్నది. గడిచిన కొంత కాలంగా తమ ప్రాంతానికి మెట్రో రైలు అందుబాటులోకి తీసుకురావాలంటూ స్థానికులు ఆందోళన చేస్తున్నా... సర్కారు పట్టించుకోవడం లేదు.

### జనాలే లేని ఫోర్త్ సిటీకి..

జనాలే లేని ఫోర్త్ సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో రైలును తీసుకెళ్తున్నారు. కానీ నిత్యం లక్షన్నర మంది రాకపోకలు సాగించే నార్త్ సిటీ విషయాన్ని మాత్రం పట్టించుకోవడమే లేదు. ఇదే ఇప్పుడు నార్త్ సిటీ ప్రాంత వాసుల ఆందోళనకు కారణమవుతున్నది. రెండు ఎలివేటెడ్ కారిడార్లకు నార్త్ సిటీలో తొలిసారి అడుగు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఎదుట నిరసన గళం విప్పిన స్థానికులు.. అప్పటి నుంచి ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రజా ప్రయోజనాలను మరిచి, స్వప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కొనసాగుతున్న ఆన్‌లైన్ పిటిషన్...

మెట్రో నిర్మాణం చేయాలంటూ కొంతకాలంగా ఆన్‌లైన్ పిటిషన్ పేరిట మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆందోళన చేస్తున్నది. స్థానికులను ఆందోళనల్లో భాగస్వామ్యం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ ప్రాంత దశను తిరగరాసే మెట్రో నిర్మాణం చేపట్టాలంటూ పెద్ద ఎత్తున్న స్థానికులు ఆందోళనల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే ఓ దఫా మెట్రో నిర్మాణం కోసం పార్కులు, కాలేజీలు, పాఠశాలలు, ఆఫీసులకు సమీపంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ పిటిషన్ కార్యక్రమంలో స్థానికులను భాగస్వామ్యం చేస్తున్నారు. ఆన్‌లైన్ పిటిషన్‌లో అనూహ్య స్పందన వస్తున్నది.

# బోర్డులు ఏమైనయ్

- నిర్మాణ ప్రాజెక్టుల వద్ద సర్వే, పర్మిషన్, బిల్డర్ ప్రొఫైల్ వివరాలు ప్రదర్శించాలన్న హెచ్ఎండీఏ
- ఎక్కడా అమలు కాని విధానం

hmda Growing Global

సిటీబ్యూరో: గ్రేటర్‌లో నిర్మాణ రంగం కుదేలైతున్నది. హైడ్రా కూల్చివేతలు ఓవైపు, ఆగిన నిర్మాణ కార్యకలాపాలతో కొనుగోలుదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ క్రమంలో హెచ్ఎండీఏ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలతో నోటీసు బోర్డులను డిస్‌ప్లే చేయాలని, సర్వే, భూమి, బిల్డర్ ప్రొఫైల్, పర్మిషన్లు, రేరా అనుమతులు వంటి వివరాలతో కూడిన నోటీసు బోర్డులను ప్రాజెక్టుల ముందు ప్రదర్శించేలా ఆదేశాలిచ్చింది. కానీ ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదు.

### పలు కీలక నిర్ణయాలు

హైడ్రా కూల్చివేతలు, ఎన్ఓసీల్లో తలెత్తిన సమస్యల నేపథ్యంలో హెచ్ఎండీఏ పలు కీలక నిర్ణయాలు అయితే తీసుకున్నది. కానీ వాటిని ఆచరణలోకి తీసుకురావడంలోనే వైఫల్యం చెందుతున్నది. గతంలో భవన నిర్మాణ అనుమతులకు రెవెన్యూ, ఇరిగేషన్ ఎన్ఓసీలు తప్పనిసరి చేసింది. అనుమతుల ప్రక్రియలో ఈ రెండు శాఖలు ఆమోదం తెలిపితే గానీ లెవల్ 2 దాటే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. తాజాగా నిర్మాణ ప్రాజెక్టు వద్ద, సంబంధిత అనుమతులు, రెవెన్యూ, ఇరిగేషన్, రేరా వంటి వివరాలను తప్పనిసరిగా నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. దీని వల్ల తనిఖీలకు వెళ్లే అధికారులకు ప్రక్రియ సులభతరం అవుతుందని, నోటీసు బోర్డులు ప్రదర్శించిన వాటినే క్షేత్రస్థాయి పరిశీలన చేసి అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టింది. కానీ హెచ్ఎండీఏ పరిధిలో ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు. కనీసం హెచ్ఎండీఏ సూచనలను కూడా బిల్డర్లు, నిర్మాణ సంస్థలు పట్టించుకోవడం లేదు.

### పర్యవేక్షణ కరువు...

హెచ్ఎండీఏ పలు విధానాలను ప్రవేశపెడుతున్నా... వాటిని పర్యవేక్షించి ఆచరణలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముఖ్యంగా హైడ్రా తర్వాత హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ మధ్య ఉన్న సమన్వయం లోపం బట్టబయలైంది. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఎన్ఓసీలను పరిగణనలోకి తీసుకుని హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చింది. తీరా హైడ్రా అధికారులు వచ్చి చెరువు భూముల ఆక్రమణ పేరిట ఆ నిర్మాణాలను కూల్చివేస్తుండటంతో కొనుగోలుదారులు బలైపోతున్నారు. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన ఎన్ఓసీ పత్రాల ఆధారంగానే అనుమతులు జారీ చేశారే తప్ప.. వాటిని క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ అధికారులు పరిశీలించకపోవడంతో ఈ సమస్యలకు కారణమని తేలింది.



### వీధి కుక్క స్వైర విహారం

బాలానగర్‌లో వీధి కుక్క స్వైర విహారం చేసింది. అంబికాకాలనీ, మెజస్టిక్ గార్డెన్ సమీపంలో దారిన వెళ్తున్న వారిపై కుక్క దాడి చేయడంతో బాలుడితో పాటు పలువురికి గాయాలయ్యాయి. దీంతో కొందరు కర్రలతో ఆ కుక్కను కొట్టి చంపారు. - బాలానగర్, నవంబర్ 17



### 15 క్వింటాళ్ల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్న ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 15 క్వింటాళ్ల నకిలీ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం ప్రకారం... మహ్మద్ షకీల్ బోయిన్‌పల్లిలోని రాజరాజేశ్వరీనగర్‌లో 'సోనీ జింజర్ గార్లిక్ పేస్ట్' పేరుతో కార్ఖానాను నిర్వహిస్తున్నాడు. ఇందులో మహ్మద్ సమీర్ అన్సారీ మేనేజర్‌గా, ముక్తార్ అసిస్టెంట్ మేనేజర్‌గా, రజింత్‌కుమార్, సోనుకుమార్, బిర్వల్ షా, ఇనాయత్, మహేశ్‌కుమార్ అందులో వివిధ పనులు చేస్తున్నారు. పూర్తిగా పాడైన అల్లం, వెల్లుల్లిని మార్కెట్‌లో తక్కువ ధరకు కొని, కొన్ని సందర్భాల్లో పనికిరాని వాటిని కూడా తెచ్చి పేస్ట్‌గా తయారు చేస్తున్నారు. అందులో యాసిడ్స్ కలిపి, ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి, అందమైన లేబుళ్లతో బయట మార్కెట్‌లోకి పంపిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం ఈ కార్ఖానాపై దాడి చేసి.. 1500 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, 55 కిలోల సిట్రిక్ యాసిడ్‌లతో పాటు రూ. 4.5 లక్షల విలువైన వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు మహ్మద్ షకీల్ అహ్మద్ మినహా మిగతా వారందరినీ అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# సార్..సెటిల్‌మెంట్ స్టైలే వేరు

## లావాదేవీల్లో వివాదాలు ఉంటే చాలు.. ఈజీగా సెటిల్ చేసేస్తారు..

## ఓ డివిజన్ ఏసీపీ వ్యవహారమిది..

- చెప్పినట్లు వినకపోతే తప్పుడు కేసులు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు.. చర్యలు తీసుకోని వైనం
- హైకోర్టును ఆశ్రయిస్తున్న బాధితులు

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ)/ బన్సీలాల్‌పేట్: భూమి, ఇండ్లు, ప్లాట్లు, వ్యాపార లావాదేవీల్లో వివాదాలు ఏదైనా సరే.. ఆయన తన అనుచరగణంతో ఈజీగా సెటిల్ చేసేస్తారు. వినలేదంటే..పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి అక్రమ కేసులు బనాయిస్తారు. అప్పటికీ వినలేదంటే నాలుగైదు కేసులు నమోదు చేయించి.. సదరు వ్యక్తిపై రౌడీషీట్ నమోదు చేస్తారు. ఇలా ఆయన సెటిల్‌మెంట్ల తీరు వేరుగా ఉంటుంది. తన మాటను ఎవరైనా ఎదిరిస్తే రౌడీషీట్లు నమోదు చేయడమే కాకుండా, కుటుంబ సభ్యులను ఠాణాల్లోకి బలవంతంగా తీసుకొస్తారు. హైదరాబాద్ నడిబొడ్డున ఈస్ట్‌జోన్‌లో ఏ ఏసీపీ వ్యవహారమిది. ఇంత జరుగుతున్నా.. సదరు అధికారిపై ఫిర్యాదులు వస్తున్నా.. ఉన్నతాధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో బాధితులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నారు.


### ఈస్ట్‌జోన్‌లో సెటిల్‌మెంట్ల దందా...

పోలీస్‌స్టేషన్ల పునర్విభజన తరువాత నార్త్‌జోన్‌లో ఉన్న పోలీస్‌స్టేషన్లు ఈస్ట్‌జోన్‌లోకి వెళ్లాయి. అక్కడ కొత్త డివిజన్ ఏర్పడింది. ఆ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ అధికారి.. తన వద్దకు వచ్చే పంచాయితీలను ఈజీగా సెటిల్ చేస్తారు. తనకు కావాల్సిన పని కోసం ఎంతకైనా తెగిస్తారు. తన డివిజన్‌లోని ఒక పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్య ఉందంటే ఆ ఠాణా ఇన్‌స్పెక్టర్, డీఐ, ఎస్సైలకు ఆదేశాలు జారీ చేస్తారు. ఒక వేళ అది సివిల్ కేసంటూ ఆ ఇన్‌స్పెక్టర్ ఏమైనా అడ్డు చెప్పాడంటే... 'నీవు కాకపోతే పక్క పోలీస్‌స్టేషన్ వాడిని అక్కడికి పంపిస్తా... నా డివిజన్‌లో ఉన్న మూడు ఠాణాలకు నేనే కింగ్‌నం'టూ బెదిరించి మరి తన కిందిస్థాయి అధికారులతో పనులు చేయిస్తారు. కొందరు బెదిరింపులకు, మరికొందరు వాటాలకు ఆయన చెప్పినట్లు తాన అంటే తందాన అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.



### కొన్ని ఘటనలు

- బీసీఏ విద్యార్థి మామిడి శెట్టి హనుమాన్ అపార్ట్‌మెంట్ నిర్మించి విక్రయాలు చేశాడు. కొనుగోలుదారులు ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో నిర్మాణదారుడికి, కొనుగోలుదారులకు మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలోకి సదరు ఏసీపీ, స్థానిక ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు జోక్యం చేసుకున్నారు. నిర్మాణదారుడిని బెదిరించారు.. వినకపోవడంతో నాలుగైదు కేసులు 15 రోజుల్లోనే నమోదు చేశారు. అప్పటికీ కూడా వినకపోవడంతో అతడిపై రౌడీషీట్ తెరిచారు. ఈ విషయంపై 15 సార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఎవరూ కూడా స్పందంచకపోవడంతో దీనిపై హనుమాన్ హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు ఈ కేసు వివాదం కోర్టులో నడుస్తోంది. ఇతడిపై నమోదు చేసిన రౌడీషీట్‌పై కోర్టు స్టే ఇచ్చింది. ఈ కేసు విచారణలో ఉందని బాధితుడు తెలిపాడు. కోర్టు జోక్యం తరువాత ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చి ఏసీపీపై అంతర్గత విచారణ చేస్తున్నట్లు సమాచారం.
- మరో కేసులో రెండు ఫ్లాట్లకు సంబంధించిన పంచాయితీని సెటిల్‌చేసి, బాధితులను బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ బెదిరింపులకు సంబంధించిన సీసీ కెమెరాల పుటేజీలను కూడా పోలీసులు ధ్వంసం చేసినట్లు ఆరోపణలున్నాయి.



బాధితుడు ధర్మేందర్‌రెడ్డి

### సాయంత్రం పిలిచి..తెల్లవారుజాము వరకు నిల్చోబెట్టారు

చిలకలగూడ పోలీసులు తనను వేధిస్తున్నారని, అక్రమంగా బెదిరించి తనతో చెక్కులపై సంతకాలను చేయించుకున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ధర్మేందర్‌రెడ్డి అనే బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. వాటి వివరాలను ఆదివారం మీడియా సమక్షంలో వెల్లడించాడు. పద్మారావునగర్‌లో వైన్స్ దుకాణం నిర్వహిస్తున్న పాతూరి ధర్మేందర్‌రెడ్డి మరో నలుగురితో కలిసి గాంధీనగర్, రామ్‌నగర్‌లో 2021-23 రెండేండ్ల పాటు రెండు వైన్స్ షాపులలో పెట్టుబడి పార్ట్‌నర్‌గా ఉన్నాడు. ఏడాది కిందటే ఆ షాపుల గడువు, వారి మధ్య రాసుకున్న ఒప్పందం కూడా పూర్తయింది. కాగా, సెప్టెంబర్ 25న పోలీసులు పిలువడంతో చిలకలగూడ పీఎస్‌కు వెళ్లానని ధర్మేందర్‌రెడ్డి తెలిపాడు. ఆ సమయంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేశ్ గౌడ్, అక్కడ తన నలుగురు పాత పార్ట్‌నర్లు, మరో వ్యక్తి ఉన్నారని చెప్పాడు. తాను వారికి ఇంకా డబ్బులు ఇవ్వాల్సి ఉన్నదని, వాటిని రెండు నెలల్లోగా చెల్లించాలని తనపై ఒత్తిడి చేసినట్లు తెలిపాడు. రెండు వైన్స్ షాపుల గడువు, తమ మధ్య అగ్రిమెంట్, ఆర్థిక లావాదేవీలు కూడా అయిపోయాయని, తాను ఎవరికీ డబ్బులు బాకీ లేనని, ఏడాది తరువాత ఇప్పుడు తానేందుకు డబ్బులు ఇవ్వాలని అడగడంతో తనపై ఏసీపీ చేయి చేసుకున్నారని, బండబూతులు తిట్టారని ధర్మేంధర్‌రెడ్డి వాపోయాడు. ఒక్కొక్కరికీ రు.32 లక్షల చొప్పున ఐదుగురికి (రూ.1 కోటి 60 లక్షలు) రెండు నెలల వ్యవధిలోగా తాను డబ్బులు చెల్లించాల్సిందేనని పోస్ట్ డేటెడ్ చెక్కులపై బలవంతంగా సంతకాలను చేయించుకున్నారని ఆరోపించారు. సంతకాలు చేయకపోతే వైద్యురాలైన తన భార్యను, ఇతర కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్ కు తీసుకుని వచ్చి వారిపై కూడా కేసులను పెడతామని ఏసీపీ బెదిరించడంతో భయపడి సంతకాలు చేశానని ధర్మేందర్‌రెడ్డి వాపోయాడు. తన ఫోన్ లాక్కుని కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనివ్వలేదని, సాయంత్రం 4 గంటలకు తాము పీఎస్‌కి వెళ్లగా, తెల్లవారుజామున మూడు గంటల వరకు నిలబడే ఉన్నానని చెప్పాడు. అదే అర్ధరాత్రి సమయంలో తాను కొనుగోలు చేసినట్టు బాండ్ పేపర్లు కూడా పోలీసులే తీసుకొచ్చినట్లు చెప్పాడు. తనతో బలవంతంగా సంతకం చేసిన అగ్రిమెంట్ పేపర్‌లో ఈ సెటిల్‌మెంట్ చిలకలగూడ పీఎస్‌లో జరిగినట్టు వాళ్లే రాశారని, దానిని గుర్తించిన తన లాయర్ సలహా మేరకు తాను సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశానని తెలిపాడు. చెక్కులను రాయించుకున్న ఐదుగురితో పాటు డీజీపీ, నగర్ పోలీస్ కమిషనర్, ఈస్ట్ జోన్ డీసీపీలను ప్రతివాదులుగా చేర్చానని చెప్పాడు. అప్పటి నుంచి తన వైన్ షాపు వద్ద చిలకలగూడ పోలీసులు పెట్రోలింగ్ వ్యాను పెట్టుకుని, కస్టమర్లు ఎలాంటి చిన్న గొడవ పడినా.. తనపై కేసు బుక్ చేయడానికి పన్నాగం పన్నారని పేర్కొన్నాడు. మఫ్టీలో వచ్చిన కానిస్టేబుళ్లు లోపలికి వచ్చి గొడవలు పెట్టుకుని, యజమానినైన తనపై, తన షాపులో పనిచేసే సిబ్బందిపై అక్రమంగా కేసులను నమోదు చేస్తున్నారని, పీఎస్‌కు పిలిచి టార్చర్‌కు గురి చేస్తున్నారని తెలిపాడు. మానసికంగా తాను చాలా ఇబ్బంది పడుతున్నానని, తనకు న్యాయం చేయాలని, తనతో బలవంతంగా రాయించుకున్న చెక్కులను, ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ రెండు రోజుల కిందట తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశానని ధర్మేందర్ తెలిపాడు.